క్లుప్తంగా

మాదక ద్రవ్యాలతో దుష్ఫలితాలు అనేకం


అవగాహన కల్పిస్తున్న ఈగల్ టీం పోలీసులు

చిత్తూరు కలెక్టరేట్ : మాదకద్రవ్యాల వల్ల దుష్ఫలితాలు అనేకమని తాలూకా పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ మురగేష్ అన్నారు. ఈ మేరకు నగరంలోని సీతమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఈగల్ టీం ఆధ్వర్యంలో డ్రగ్స్ నిరోధక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. వాటి వల్ల కలిగే నష్టాలను అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. మాదక ద్రవ్యాలకు సంబంధించి టోల్ ఫ్రీ 1972 నంబర్‌కు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలోఈగల్ టీం హెడ్ కానిస్టేబుల్ గిరిబాబు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుకేతు పూజలు


రాహుకేతు పూజలు చేస్తున్న భక్తులు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయంభు శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వరస్వామి మూలవర్లకు ఉదయం అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు చేపట్టారు. ప్రత్యేక పూజల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని దోషనివారణ చేసుకున్నారు. అనంతరం మొగిలీశ్వర స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మునిరాజు, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్ఓ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం స్వస్థ నారీ – స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. డీఎంఅండ్‌హెచ్ఓ సుధారాణి పోస్టర్‌ను ఆవిష్కరిస్తూ.. కార్యక్రమ వివరాలను వెల్లడించారు. బుధవారం నుంచి పరివార్ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. మహిళల ఆరోగ్యమే ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. జిల్లావ్యాప్తంగా 538 క్యాంపులు నిర్వహిస్తామన్నారు. ఈ క్యాంపుల ద్వారా పలు రకాల వైద్య పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు మంజూరు చేయండి


మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల అభివృద్ధికి సబ్‌ప్లాన్ నిధులను నేరుగా మంజూరు చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ కోరారు. ఈ మేరకు కలెక్టర్ సోమవారం విజయవాడలో నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుతో జిల్లా అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికను కాన్ఫరెన్స్‌లో చర్చించారు. ఇందులో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో అభివృద్ధికి రూ.2.5 కోట్ల పనులు చేపట్టడం జరిగిందన్నారు. ప్రత్యేక అధికారులను నియమించి పనుల పురోగతి పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. జిల్లాకు సబ్‌ప్లాన్ నిధులు నేరుగా కేటాయిస్తే పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ఇప్పటివరకు చేపట్టిన పనులకు పెండింగ్ నిధులు విడుదల చేయాలని కలెక్టర్ సీఎంను కోరారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

ఐరాల: పంచాయతీల అభివృద్ధికి పంచాయతీ కార్యదర్శులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాల శుభ్రతపై దృష్టి సారించాలని సూచించారు. మురుగు కాల్వలు, గుంతల్లో నీరు నిల్వలు ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసి ఇచ్చేలా ప్రజలకు పంచాయతీ సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు నూతన ఎంపీడీఓకు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఓ భువనేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.


నిరసనకు దిగిన పీజీ వైద్యులు


అత్యవసర విభాగం

నిర్లక్ష్యం తగదు.. సహనం కోల్పోవద్దు

- జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి రాత్రివేళ ప్రమాద క్షతగాత్రుల తాకిడి
- పెరిగిన ఎమర్జెన్సీ కేసులు
- మద్యంమత్తులో గాయపడి వచ్చేవారే అధికం
- అత్యవసర కేసులు వచ్చినప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డ్యూటీ డాక్టర్లు
- క్షణికావేశంలో సహనం కోల్పోయి భౌతిక దాడులకు దిగుతున్న బాధితులు
- ప్రశ్నార్థకంగా వైద్యుల భద్రత
- ఆస్పత్రిలో కొరవడిన నిఘా వైఫల్యం

జిల్లాకేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో అత్యవసర విభాగంలో గందరగోళం నెలకొంది. తరచూ ప్రజలు, వైద్యుల మధ్య వాగ్వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ వివాదం కాస్త తారాస్థాయికి చేరి గొడవలకు దారితీస్తోంది. ఆస్పత్రికి వచ్చే ప్రజలతో కొంతమంది వైద్యులు అమర్యాదగా ప్రవర్తిస్తున్నారనే మాటలు వినిపిస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో వచ్చినప్పుడు డ్యూటీ డాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ.. పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. దీంతో ఆ క్షణంలో క్షతగాత్రులు ఆగ్రహావేశాలకు లోనవుతూ డాక్టర్లపై దాడికి దిగుతున్నారు. ఆస్పత్రిలో నిఘా వ్యవస్థ కొరవడడంతో డాక్టర్ల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఇటీవల జిల్లా ఆస్పత్రిలో చోటు చేసుకుంటున్న వరుస పరిణామాలు ఇందుకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి.

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం రాత్రి ముగ్గురు డాక్టర్లపై ఇంజినీరింగ్ విద్యార్థులు దాడి చేశారు. ఈ దాడిలో ఓ పీజీ డాక్టర్ ముక్కు పలిగింది. మిగిలిన ఇద్దరికి తేలికపాటి గాయాలయ్యాయి. దీంతో పీజీ వైద్యులు విధులు బహిష్కరించి రోడ్డెక్కారు. ఆపై దాడి చేసిన వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే ఆదివారం రాత్రి కూడా కొంతమంది బైక్ వచ్చి ఆస్పత్రి ఎదుట వీరంగం సృష్టించడంతో సోమవారం ఉదయం మళ్లీ వైద్యులు విధులు బహిష్కరించారు.

భద్రత ఏదీ..?

ఆస్పత్రిలో భద్రత కరువుతోంది. ప్రధానంగా గొడవలు జరిగినప్పుడు సెక్యూరిటీ సిబ్బంది కలిగించుకోలేకపోతున్నారు. లేకుంటే దెబ్బలు తిని పక్కకు తప్పుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఇక అత్యవసర విభాగం పక్కనే పోలీసు అవుట్ పోస్టు ఉన్నా.. ఫలితం లేకుండా పోతోంది. అక్కడ రాత్రి పూట పోలీసులు విధుల్లో ఉండడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. దాడి జరిగిన రాత్రి కూడా పోలీసులు లేరని వైద్యులు వాదిస్తున్నారు. భద్రత కావాలని పట్టుబడుతున్నారు. విధులను బహిష్కరించి నిరసనకు దిగుతున్నారు.

రాత్రిపూట మద్యం తంటా..

గత కొన్ని నెలలుగా జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి అత్యవసర సేవలు పెరిగాయి. పగలు సేవలతో పాటు రాత్రి పూట సేవలు అధికమయ్యాయి. ఈ సేవల్లో అధికంగా రోడ్డు ప్రమాదం, గొడవలు, కత్తి పోట్లు వంటి వాటితో వచ్చే వారి సంఖ్య పెరిగింది. వీరిలో చాలామంది మద్యం సేవించి ఉంటున్నారని వైద్యులు చెబుతున్న మాట. మద్యం మత్తులో ఉండే వారికి ఏరకమైన చికిత్స చేయాలి ? వారికి ఏ రకమైనా మందులు ఇవ్వాలనేది డాక్టర్ నిర్ణయిస్తారు. అయితే కొంతమంది మద్యం మత్తులో ఇష్టానుసారంగా మాట్లాడుతూ డ్యూటీ డాక్టర్ల సహనానికి పరీక్ష పెడుతున్నారు. గాయపడిన వ్యక్తితో పాటు సహాయకుడిగా వచ్చిన వారు సైతం మద్యం మత్తులో ఉండడంతో వైద్యులు భయంభయంగా ట్రీట్మెంట్ చేస్తున్నారు.

రాత్రివేళ అత్యవసర కేసులు వస్తే..

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని అత్యవసరం విభాగానికి ఓపీలు ప్రతిరోజూ 200 నుంచి 300 వరకు వస్తుంటాయి. ప్రధానంగా రాత్రివేళ మాత్రం 100కు పైగా కేసులు వస్తున్నాయి. ఈ కేసుల్లో ప్రధానంగా రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారే అధికంగా వస్తున్నారు. ఇందులో మద్యం సేవించి రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. దీనికి తోడు పాయిజన్ తీసుకున్నవారు, కడుపు నొప్పి, గుండెనొప్పి, తీవ్ర జ్వరం వంటి కేసులు కూడా వస్తుంటాయి. అయితే ఇలాంటి కేసులు వచ్చినప్పుడు విధుల్లో ఉన్న డాక్టర్ల సరైన వైద్యం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే మాటలు బాధితుల నుంచి వినిపిస్తున్నాయి. ప్రాణాపాయ పరిస్థితుల్లో వస్తే తక్షణం స్పందించడం లేదని ఆగ్రహానికి గురవుతున్నారు.

రెఫర్ గోల..

ఆరునెలల కిందట వరకు ఆస్పత్రిలో రెఫర్‌ల సంఖ్య అధికమైందని ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో ఆస్పత్రిలో రెఫర్ చేయడం మానేశారు. తీసుకెళ్లిన వ్యక్తి పరిస్థితి విషమంగా ఉందని చెబుతూ.. రెఫర్ చేయడం కుదరదని వైద్యులు తేల్చిచెబుతున్నారు. రెఫర్ కాకుండా మీరే వెళ్లిపోండి అంటూ సలహా ఇస్తున్నారు. అలా వెళ్లినప్పుడు మార్గమధ్యలో ఏదైనా జరగకూడనిది జరిగితే ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల ఓ ఎంఎన్ఓ పురుగుల మందు తాగి పరిస్థితి విషమంగా మారింది. అతన్ని కుటుంబీకులు, బాధితుడితో పాటు పనిచేసే కొందరు సీఎంసీకి రెఫర్ చేయమన్నారు. రెఫర్ కుదరదని చెప్పడంతో వారంతా ఆస్పత్రి ఎదుట నిరసనకు దిగారు. వారం క్రితం వైద్యశాఖలో పనిచేసే ఓ వ్యక్తి కుటుంబీకులు తీవ్ర అస్వస్థకు గురయ్యారు. ఆస్పత్రికి తీసుకొస్తే.. పరిస్థితి విషమంగా ఉందని, బయటకు తీసుకెళ్లడం మంచిదని సూచించారు. తీరా రెఫర్ చేయకపోవడంపై విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని సాంబయ్య కండ్రిగ – కట్టమంచి బైపాస్ రోడ్డు నిర్మాణానికి సోమవారం మేయర్ అముద, ఎంపీ దగుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నాయుడు కలిసి భూమిపూజ చేశారు. రూ.3.67 లక్షల వ్యయంతో ఇక్కడ బీటీ రోడ్డు నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలోకార్పొరేటర్ హరి జీరెడ్డి, కమిషనర్ నరసింహ ప్రసాద్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


ఎంపీడీఓ పెంచల వీరేంద్ర

యాదమరి: నూతన ఎంపీడీఓగా పెంచల వీరేంద్ర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లా అల్లూరు మండలంలో డిప్యూటీ ఎంపీడీఓగా పనిచేస్తూ పదోన్నతిపై ఆయన ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పనిచేస్తున్న వేణు యథావిధిగా తన పూర్వస్థానం ఏఓగా సేవలు అందించనున్నారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

చెత్తకుప్పల్లా దరఖాస్తులు



గుడిపాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో చెత్తకుప్పల్లా సర్టిఫికెట్లకు సంబంధించిన దరఖాస్తుల కాగితాలు పడి ఉన్నాయి. మండలంలోని 17 సచివాలయాలకు సంబంధించిన ప్రజలు ఇన్‌కమ్, క్యాస్ట్, ఫ్యామిలీ మెంబర్, ఈడబ్ల్యూఎస్, మ్యుటేషన్‌తో పాటు పలు రకాలకు సంబంధించి ఆయా సచివాలయాల్లో సర్టిఫికెట్లు కావాలని దరఖాస్తులు చేస్తుంటారు. ఆ తరువాత వాటిని సంబంధిత వీఆర్‌ఓలకు అందజేస్తే, వాటిని తహసీల్దార్లు అప్రూవ్ చేస్తారు. అనంతరం ఆ దరఖాస్తులను రెవెన్యూ సిబ్బంది భద్రపరచాలి. కానీ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల దరఖాస్తు ఫారాలను విచ్చలవిడిగా పడేస్తున్నారు. కార్యాలయం మిద్దెపైన, బాత్‌రూమ్ పక్కన చెత్తకుప్పల్లా పారబోశారు. తాము ధ్రువీకరణ పత్రాల కోసం ఇచ్చిన దరఖాస్తులను ఇలా నిర్లక్ష్యం పడేయడం ఏంటని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేటి తరానికి మోక్షగుండం స్ఫూర్తి


మోక్షగుండం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఇంజినీర్లు


నివాళులు అర్పిస్తున్న ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్‌అహ్మద్

చిత్తూరు కార్పొరేషన్: మోక్షగుండం విశ్వేశ్వరయ్య నేటి తరానికి స్ఫూర్తి అని చిత్తూరు ఆర్కిటెక్ అండ్ సివిల్ ఇంజినీర్స్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. సోమవారం 58వ ఇంజినీర్స్‌డే సందర్భంగా ఆర్అండ్‌బీ అతిథి గృహంలోని మోక్షగుండం విగ్రహానికి పుష్పాంజలి ఘటించి మాట్లాడారు. అనంతరం సీనియర్ ఇంజినీర్ సుధాకర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు జయప్రకాష్, కార్యదర్శి విజయశేఖర్, కోశాధికారి గుణశేఖర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మోక్షగుండంకు నివాళి

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయంలో ఇంజినీర్స్ డే వేడుకలను నిర్వహించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. మోక్షగుండం వల్ల ఇంజినీర్లకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. ప్రభుత్వశాఖల్లో పలు కీలక పనులు ఇంజినీర్లు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. పదవిని అలంకరప్రాయంగా కాకుండా బాధ్యతగా పరిగణించాలన్నారు. కార్యక్రమంలో పీఓ రెడ్డెప్ప, ఏఓ బాలు, జేఏఓ విద్యాసాగర్, ఏఈ వివేకానందరెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ఉద్యమాలు


యూటీఎఫ్ రణభేరి ర్యాలీ

బంగారుపాళెం: సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్‌ను అమలు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసరావు అన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు తలపెట్టిన రణభేరి యాత్ర సోమవారం బంగారుపాళెంకు చేరుకుంది. స్థానిక ప్రభుత్వ పాఠశాల వద్ద స్థానిక యూటీఎఫ్ నాయకులు స్వాగతం పలికారు. ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని, ఉపాధ్యాయులకు ఇతర పనులు అప్పగించకుండా పిల్లలకు పాఠాలు చెప్పేలా చూడాలని నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏలు విడుదల చేయాలని, 12వ పీఆర్‌సీని వెంటనే అమలు, ఉమ్మడి సర్వీసుల ద్వారా పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వానికి వినతి చేసినా పట్టించుకోలేదన్నారు. అందుకే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించుకునేందుకు ఉద్యమాలు, ఆందోళనలు సాగిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు కళ్లు తెరవాలన్నారు. అనంతరం రణభేరి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, జిల్లా గౌరవ అధ్యక్షుడు జీవీ రమణ, గౌరవ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, అధ్యక్షుడు సోమశేఖర్ నాయుడు, ప్రధాన కార్యదర్శి మణికంఠ, జిల్లా కార్యదర్శి సరిత, మండల అధ్యక్ష, కార్యదర్శులు మహేష్, మోహన్‌రెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా మండల స్థాయి క్రీడాపోటీలు



అండర్-17 కబడ్డీ పోటీల్లో విజేతగా నిలిచిన బాలుర జట్టు, తవణంపల్లె బాలికల జట్టు

తవణంపల్లె: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సోమవారం మండల స్థాయి క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు అండర్-14, అండర్-17 పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలను హెచ్‌ఎం వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయులు ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, యోగా పోటీలను నిర్వహించారు. కబడ్డీ పోటీల్లో బాలికల విభాగంలో తవణంపల్లె హైస్కూల్ విద్యార్థినులు విజేతగా నిలిచారు. అండర్-17 బాలుర, బాలికలు విభాగంలో ఉత్తమ ప్రతిభ చూపిన వారిని విన్నర్, రన్నర్‌గా ఎంపిక చేశారు. అండర్-14 విభాగంలో విన్నర్, రన్నర్‌గా నిలిచిన బాలబాలికల జట్లను ఎంపిక చేసి జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు పంపుతామని పీడీ లలిత తెలిపారు.

తెప్పోత్సవ ఏర్పాట్ల పరిశీలన

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం జరిగే తెప్పోత్సవ ఏర్పాట్లను సోమవారం ఈఓ పెంచల కిషోర్ పరిశీలించారు. వార్షిక బ్రహ్మోత్సవంలో భాగంగా మంగళవారం రాత్రి తెప్పోత్సవం నిర్వహించారు. ఇందులోభాగంగా ముందస్తుగా తెప్పోత్సవ ట్రయల్ రన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఐ నరసింహులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తవణంపల్లె: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. సోమవారం మండలంలోని ఎగువవెంకటాపురంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం జరిగింది. డాక్టర్ మోహన్‌వేలు ప్రజలకు ఆహార నియమాల గురించి వివరించారు. వాటర్ ట్యాంకులు క్లోరినేషన్ చేయించాలని వివరించారు. వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. ఏఎస్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో వినతులను విచారించండి

చిత్తూరు అర్బన్: ప్రజా వేదికలోవచ్చిన ప్రతీ ఒక్క ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో విచారించి, పరిష్కరించేలా చూడాలని చిత్తూరు మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. ఆర్థిక అంశాలతో ముడిపడని వినతులను తక్షణం పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. చిత్తూరు నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, ప్రజారోగ్యం, రెవెన్యూ, విభాగాలకు సంబంధించి ఫిర్యాదులు అందాయి. ఈ గ్రీవెన్స్‌లో మున్సిపల్ ఇంజినీరు వెంకటరామిరెడ్డి, ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్, ఏసీపీ నాగేంద్ర, రెవెన్యూ అధికారి గోపాలకృష్ణవర్మ తదితరులు పాల్గొన్నారు.

నీటి కొరత లేకుండా చూడండి


స్కూల్‌లో తాగునీటి సమస్యను పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

యాదమరి: కొటాలం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నెలకొన్న నీటి కొరత తీర్చాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉషారాణి స్పష్టం చేశారు. ఆదివారం 'గొంతెండుతోంది మాస్టారు' అని కథనం సాక్షిలో వెలువడిన విషయం పాఠకులకు విదితమే. అయితే దీనిపై స్పందించిన సంబంధిత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం ఆమె కొటాలం పాఠశాలకు వెళ్లి పరిశీలించారు. అక్కడి సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ సహాయకులను అక్కడకు పిలిచి పిల్లలకు తాగడానికి, కాలకృత్యాలకు నీటి కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. విధిగా క్రమం తప్పకుండా పాఠశాల విద్యార్థులకు అవసరమైన నీరు అందేలా చూడాలని స్థానిక సర్పంచ్‌కు సూచించారు. అనంతరం వాటర్ ట్యాంకుకు కొళాయిలు ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం యూసుఫ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే విద్యావ్యవస్థ అస్తవ్యస్తం

- మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం
- జిల్లాలో యూటీఎఫ్ రణభేరి ప్రచార బైక్ జాతా


యూటీఎఫ్ బైక్ జాతాలో పాల్గొన్న విఠపు

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్ల సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం అలసత్వం తగదని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. ఈ మేరకు సోమవారం యూటీఎఫ్ జిల్లావ్యాప్తంగా రణభేరి ప్రచార బైక్ జాతా కార్యాక్రమం నిర్వహించింది. చిత్తూరు జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పాల్గొని పలు అంశాలపై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం నూతన విద్యావిధానం పేరుతో పాఠశాలలను పునర్‌వ్యవస్థీకరణ పాఠశాల వ్యవస్థలో 9 రకాల స్కూళ్లు పుట్టుకొచ్చాయన్నారు. దీని పర్యవసానంగా అనేక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ స్కూళ్లుగా మారాయన్నారు. మూడు లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రైవేట్ స్కూళ్లకు మారిపోయారని తెలిపారు. దీనికి కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమ్మోజి శ్రీనివాస్ మాట్లాడుతూ 15 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు పీఆర్‌సీ కమిటీలో ఎలాంటి పురోగతి లేకపోవడం అన్యాయమన్నారు. రాష్ట్ర కార్యదర్శులు ఎస్ఎస్ నాయుడు, జీవీ రమణ మాట్లాడుతూ నాలుగు విడతల కరువుభత్యం, ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన రూ.26 వేల కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్‌నాయుడు, మణిగండన్, జిల్లా గౌరవ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, సహాధ్యక్షులు రెడ్డెప్ప నాయుడు, రెహనా బేగం, కోశాధికారి ప్రసన్నకుమార్, ఎస్‌పీ బాషా తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి ప్రమాదకరం


టీకాలు వేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

యాదమరి: పశువులకు సోకే గాలికుంటు వ్యాధి అత్యంత ప్రమాదకరమని పాడి రైతులు, పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. సోమవారం ఆయన జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా నర్రావూరులో గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడిరైతులు గాలికుంటు వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే అన్నివిధాలా నష్టపోవాల్సి వస్తుందన్నారు. ముఖ్యంగా వ్యాధికి గురైన పశువుల్లో పాల దిగుబడి గణనీయంగా తగ్గిపోవడంతో పాటు వాటి పని సామర్థ్యం కూడా తగ్గుతుందన్నారు. అనంతరం సంబంధిత వైద్యాధికారులు, మండల నాయకులతో కలిసి పశువులకు టీకాలు వేశారు. జేడీ డా.ఆరిఫ్, సహాయ సంచాలకులు డా.ఆసిఫ్, శ్రీలక్ష్మి, పశువైద్యాధికారి మునిచంద్ర, రైతులు పాల్గొన్నారు.

గుడిపాలలో..

గుడిపాల: పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలను పాడిరైతులు తప్పనిసరిగా వేయించాలని పశువైద్యాధికారి సాయితేజ అన్నారు. గొల్లమడుగులో సోమవారం ఆయన పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి టీకాలను ప్రతి ఒక్కరూ పశువులకు వేయించాలని సూచించారు. ఈ టీకాలు వేయకపోతే పశువులు వ్యాధుల బారిన పడవచ్చని, ప్రభుత్వం ఉచితంగా టీకాలు వేయిస్తుందన్నారు. గుడిపాలలో 17 వేల వరకు పాడి ఆవులు, ఎద్దులు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 31 వరకు గ్రామాల్లో టీకాలు వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గోపాలమిత్ర కిషోర్ పాల్గొన్నారు.

నవధాన్యాల పంపిణీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం తాళంబేడు, పచ్చనపల్లి గ్రామాల్లో సోమవారం ప్రకృతి వ్యవసాయ రైతులకు ఉచితంగా నవధాన్యాలు పంపిణీచేశారు. ప్రకృతి వ్యవసాయ శాఖ డీపీఎం వాసు చేతుల మీదుగా రైతులకు ఈ నవధాన్యాలను అందజేశారు. కార్యక్రమంలో అధికారులు సుబ్రహ్మణ్యం, సదాశివనాయుడు, రైతులు పాల్గొన్నారు.

సంఘ సభ్యులు ఆర్థిక అక్షరాస్యత సాధించాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థిక అక్షరాస్యతను సాధించాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి అన్నారు. సోమవారం జిల్లా కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యతను సాధించేందుకు ఫైనాన్షియల్ లిట్రసీ కమ్యూనిటీ రీసోర్స్ పర్సన్‌లు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. నేటి టెక్నాలజీ యుగంలో గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయ సంఘాల సభ్యులు ఆర్థిక కార్యక్రమాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా టెక్నాలజీని అందిపుచ్చుకుని తమ ఆర్థిక కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. సంఘాల ఆర్థిక లావాదేవీలు పారదర్శకంగా కొనసాగాలంటే సాంకేతిక పరిజ్ఞానం అవసరమన్నారు. ఆన్‌లైన్ పేమెంట్, డిజిటల్ వ్యవస్థ, బ్యాంకింగ్ కార్యక్రమాలపై స్వయం సహాయక సంఘ సభ్యులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కొందరు సభ్యులు ఈ విధానాన్ని కొనసాగిస్తున్నప్పటికీ అనేక మంది వీటిపై పరిజ్ఞానం లేకుండా పలు రకాలుగా మోసపోయే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. దీంతో ఇలాంటి మోసాలకు చరమగీతం పాడాలన్న ఉద్దేశంతో ఈ శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నమన్నారు. కార్యక్రమంలో డీపీఎంలు,ఏపీఎంలు, తదితరులు పాల్గొన్నారు.